

# నెత్తుటి మరక

- పేరూరు బాలసుబ్రమణ్యం

ఉగాది పోటీలో ఎంపికైన కథ





గవర్నమెంటు జనరల్ హాస్పిటల్ జనంతో సందడిగా వుంది. వార్డుల్లోని బెడ్లన్నీ కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళ్ళే ఆర్థిక స్థోమత లేని పేద పేషంట్లతో నిండి వున్నాయి.

పేషంట్లను చూడటానికి రోజువారి కేటాయించిన సమయం అది. కాబట్టి బంధువులు, మిత్రులు వారి ఆర్థిక స్థోమతనుబట్టి పండ్లు ఫలాలతో వచ్చి పలకరిస్తున్నారు, పరామర్శిస్తున్నారు. ధైర్యపరుస్తున్నారు. తోచిన సలహాలిస్తున్నారు. వారి పరామర్శతో మనకేదో అయిపోతోంది అందుకే వీరంతా చూడటానికి వచ్చారు అనుకుని పేషంట్లు మరింత దిగులుకు లోనవుతున్నారు. అలా హాస్పిటల్ ఆవరణమంతా జనాలతో కలకలంగా వుంది.

హాస్పిటల్‌లో శుభ్రత లేదు. పగలు ఈగలతో, రాత్రి దోమలతో పేషంట్లు నరక యాతన అనుభవిస్తూ మరికొన్ని రోగాలు ఉచితంగా అంటగట్టుకుంటున్నారు.

జనరల్ హాస్పిటల్‌కు ఎదురుగా రోడ్డుకు అవతల వుండే కార్పొరేట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ దీనికి భిన్నంగా వుంది.

అరుపులు ఆగడాలు లేవు. కలకలం అసలే లేదు. శుభ్రంగా ఏ గదికి ఆ గది వేరువేరుగాఏసీతో చల్లగా సందడి లేకుండా ప్రశాంతంగా వుంది. ఇక్కడ పరామర్శించడానికి వచ్చిన వారితో పేషంట్లే నెమ్మదిగా నవ్వుతూ మాట్లాడుతున్నారు.

పేదోడు అంత ఖరీదైన వైద్యం చేయించుకునేదీ లేదు. జ్వరం, తలనొప్పి, జలుబు లాంటివి తప్ప అంతకుమించి పెద్ద జబ్బులొస్తే బతికేదీ లేదు. పేదోడి జీవన ప్రమాణ స్థాయిని డబ్బు ఎప్పుడో మింగేసింది.

డాక్టర్లకు మాత్రం ఎక్కడైనా ఒక్కటే. ఆత్మహత్యల నుంచి యాక్సిడెంట్ కేసుల వరకు, కడుపునొప్పి నుంచి క్యాన్సర్ వరకు అనేక రకాల కేసులను ప్రతి నిత్యం చూస్తున్న డాక్టర్లకీ, నర్సులకి మాత్రం హాస్పిటల్‌లో ఏడుపులు, బాధలు, ప్రాణాలతో వచ్చి శవాలుగా వెళ్ళడం ఇవన్నీ సర్వసాధారణం అయిపోయాయి.

ఇద్దరు డాక్టర్లు హాస్పిటల్ నుంచి ఏదో మాట్లాడుకుంటూ హుందాగా బయటకు వస్తున్నారు.

ఓ ముసలి దంపతులు బయట నిలబడి వారికోసమే ఎదురు చూస్తూ వారిని చూడగానే "డాక్టర్ బాబుగారూ! ఎలాగైనా మా బిడ్డ ప్రాణాలు కాపాడండయ్యా!" అంటూ దణ్ణం పెట్టి దీనంగా అడుక్కోసాగారు.

"ఉదయమే చెప్పాం కదా! బ్లడ్ బ్యాంక్‌లో ఎ పాజిటివ్ గ్రూపు లేదని మీరు ఇంకో గంట లోపు ఆ బ్లడ్ ఇచ్చే వారిని తీసుకు రాకపోతే మీ కొడుకు ప్రాణానికే ప్రమాదం" అని చెప్పి కాఫీకోసం క్యాంటీన్‌లో దూరారు ఆ ఇద్దరు డాక్టర్లు.

ఆ మాటలు విన్న ముసలి తల్లి భోరున విలపించసాగింది.

"భగవంతుడా! తల కొరివి పెట్టాల్సిన ఒక్కగానొక్క బిడ్డ ప్రాణం గాలిలో దీపంలా కొట్టుకుంటూంటే, ఈ బతుకు మాకు మాత్రం ఎందుకయ్యా! వాడికంటే ముందే మమ్మల్ని తీసుకెళ్ళు స్వామీ! తీసుకెళ్ళు...!" అంటూ ఆ ముసలి తల్లి కిందపడి తలను రోడ్డుకేసి బాదుకొంటోంది.

ఆ వృద్ధుడు ఆమెను ఆపడానికి ప్రయత్నం చేస్తూనే పెల్లుబుకుతున్న దుఃఖాన్ని ఆపుకోలేక ఆమెను హత్తుకుని తనూ విలపించసాగాడు.

వారి బాధను చూసిన వాచ్‌మేన్ ఆ రక్తం ఎలా సంపాదించాలో చెప్పాడు.

వాచ్‌మేన్ మాటలు విన్న తరువాత వారి కళ్ళల్లో కాస్తంత జీవం కనిపించింది. ఏడవటం ఆపి వాచ్‌మేన్‌కు కృతజ్ఞతా భావంతో చేతులు జోడించి నమస్కరించి, అతను చెప్పిన ప్రకారం హాస్పిటల్ కాంపౌండ్ వాల్‌గేటుకు కొంచెం దూరంలో వున్న రిక్షా స్టాండు వైపు నడిచారు.

"ఎక్కడకెళ్ళాలండీ" వరుసలో మొదట రిక్షా పెట్టుకుని వున్న కొండయ్య అడిగాడు.

"మాకు రిక్షా వద్దు బాబూ! ఏ పాజిటివ్ రక్తం కావాలి"

ఆ మాట వినగానే కొండయ్యతోపాటు రిక్షా వారిలో కొందరు ఆ ముసలి దంపతులను ఈగలు ముసిరిన బెల్లం వలె చుట్టుకున్నారు. రక్తం అమ్ముకోవడానికి బేరానికి దిగారు.

"ఉదయమే చెప్పాం కదా! బ్లడ్ బ్యాంక్‌లో ఎ పాజిటివ్ గ్రూపు లేదని మీరు ఇంకో గంట లోపు ఆ బ్లడ్ ఇచ్చే వారిని తీసుకు రాకపోతే మీ కొడుకు ప్రాణానికే ప్రమాదం"

చాలా మంది మాత్రం రక్తంలో కూడా ఇన్ని గ్రూపులను సృష్టించిన ఆ సృష్టికర్తపై మండిపడ్డారు. వారిది ఎ పాజిటివ్ గ్రూపు కానందుకు బాధ పడ్డారు. ఈసారైనా నాలుగు రూకలు రాకపోతాయా? అనుకున్న కొండయ్యకు మాత్రం వీళ్ళు ఎగబడే దాన్ని చూసి నీరుగారి పోయాడు.

రిక్షాలో కూర్చుని ఆలోచనలో పడ్డాడు. శరీరంలోని శక్తినంతా మోకాళ్ళలోకి తెచ్చుకుని పెట్రోల్, డీజిల్, గ్యాసులతో నడిచే వాహనాల పోటీని ఎదుర్కొని రోజంతా రిక్షా లాగి సంపాదించే సంపాదనలో సగం పైగా రిక్షాల యజమానే బాడుగకింద గుంజుకొంటుంటే మిగిలిన సగంతో నూకలు కొని గంజి కాసుకుని తాగేందుకే సరిపోవడం లేదు.

అలాంటిది దీర్ఘకాలిక జబ్బుతో మంచాన పడి దగ్గుతున్న తల్లికి మందులు ఎలా కొనగలను? నాన్నా రేపు స్వాతంత్ర్య దినోత్సవం మా టీచరు మంచి బట్టలు వేసుకుని రమ్మన్నాడు. నాకు కొత్త బట్టలు కావాలి నాన్నా అని అడిగిన కూతురికి బట్టలు ఎలా కొనగలను? శరీరంపై బట్టలు లేకుండా దుత్తలాంటి పొట్ట ముందుకొచ్చి బద్దెముకలు బయటేసుకుని వెదురు పుల్లల్లాంటి కాళ్ళు చేతులతో కామెర్ల వ్యాధితో బక్కచిక్కిన మూడేండ్ల మారుడ్ని ఎలా బతికించుకోగలను? అని ఆలోచిస్తున్నాడు కొండయ్య.

శిశువుకు సరైన పౌష్టికాహారం, తల్లి పాలు, మందులు ఇవ్వకపోతే ఎన్ని రోగాలు వస్తాయో చూపడానికి శిశు సంక్షేమ శాఖ వారికి కొండయ్య కొడుకు ఫొటో చాలు.

కొండయ్య ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు. "బాబూ! మాకు కావాల్సిన రక్తం మీలో ఎవరికుందో తెలుసుకోవాలి కదా! రండి బాబూ" అన్నాడు వృద్ధుడు. "తాతా! డాక్టర్ బాబుకైనా ఆయన రక్తం ఏ గ్రూపో తెలియకపోవచ్చు గానీ ఈ సెంటర్‌లో వున్న మా రిక్షా వాళ్ళకంతా ఎవరిది ఏ గ్రూపు రక్తమో బాగా తెలుసు". ఒక వ్యక్తి అతని సందేహం తీర్చాడు.

"అవును తాతయ్యా! మాలో ఆరు మందిది నీకు కావాల్సిన గ్రూపే" అన్నాడు రిక్షా యువకుడు నవీన్. "సరే ఎవరో ఒకరు వచ్చి రక్తమిచ్చి నా బిడ్డ ప్రాణాలు నిలబెట్టండి బాబూ! నా శక్తి మాత్రం ఇచ్చుకుంటాను."

నా శక్తి మాత్రం అన్న మాటకు రిక్షావారి ముఖాలు తెల్లబోయాయి.

ముసలి దంపతులు వారిని అడుక్కున్నారు. ప్రాధేయపడ్డారు. కాళ్ళు పట్టుకున్నారు కానీ ఫలితం లేదు. బ్లడ్ బ్యాంక్ వైపు ఆశతో పరుగెత్తారు.

కొండయ్య అంతా గమనిస్తూనే వున్నాడు 'ఛీ!' వీళ్ళు మాకంటే దరిద్రుల్లా వున్నారు. వీరికి రక్తం అమ్మితే మన దరిద్రం తీరదు అనుకున్నాడు.

కార్పొరేట్ హాస్పిటల్ నుండి రిక్షా స్టాండు వద్దకు ఒక ఎర్రటి కారు వచ్చి ఆగింది. అందులోంచి చెయ్యెత్తు మనిషి దిగి రిక్షా స్టాండు వైపు చూసాడు.

'ఇదే రిక్షా స్టాండు' అనే అక్షరాలు తెల్లని బోర్డు మీద ఎర్రటి రంగుతో రాసి వుంది. అది 'ఇచ్చట రక్తం అమ్మబడును' అని రాసినట్లుంది.

"ఏం కావాలి సార్!" ఆతృతతో అన్నాయి రెండు మూడు గొంతులు ఒకేసారి.

'కారులో దిగిన మీకు రిక్షా అవసరం ఏముంటుంది మీకు కావలసింది రక్తమే అయి వుంటుంది. అమ్మడానికి మేము సిద్ధమే అన్నట్లుంది వారు అడిగే తీరు.


"మీలో ఎవరైనా బ్లడ్ ఇస్తారా?"

"ఏ గ్రూపు సార్!" తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ప్రాధేయపూర్వకంగా అడిగారు.

"ఎ పాజిటివ్ బ్లడ్ కావాలి డబ్బు ఎంతైనా పరవాలేదు."

కారులో దిగిన వ్యక్తి బంధువుకు యాక్సిడెంట్ అయి ఎక్కువ బ్లీడింగ్ కావడం వలన ఆపరేషన్ చేయాలంటే నలభై నిమిషాలలో బ్లడ్ అవసరం. బ్లడ్ బ్యాంకులో లేదు. ఆ బ్లడ్ అత్యవసరమని లోకల్ ఛానల్ టీవీలో ప్రకటన కూడా ఇచ్చాడు. రక్తదానం చేసేవారు సంప్రదించవలసిన అడ్రసు, మొబైల్ నంబరు కూడా ఇచ్చాడు. ఇంకా అనేక రకాల ప్రయత్నాలు చేసాడు. కానీ తక్షణం బ్లడ్ దొరకలేదు. అంతలో ఒక మిత్రుడి ద్వారా రిక్షా వారి విషయం తెలుసుకుని అక్కడికి వచ్చారు.

'డబ్బు ఎంతైనా పరవాలేదు' అన్న మాట వినగానే



> ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి పది వేలు డిపాజిట్ చేస్తే ఇస్తామంటున్నారు. అది కట్టే స్థోమత లేకనే రిక్షా లాగుతున్నాను. అందుకని నా రక్తం అమ్మేసి ఆ ఉద్యోగమైనా సంపాదించుకుంటా!

కొండయ్యకు ఒక్కసారిగా ప్రాణం లేసొచ్చింది. ఎందుకంటే తనదీ ఎ పాజిటివ్ రక్తమే కాబట్టి. ఈసారి రక్తం తనే అమ్మాలి. ఆ డబ్బుతో తన కష్టాలన్నీ తీరిపోతాయి. తల్లికి మందులు, భార్యా పిల్లలకు బట్టలు, చిన్నోడికి ఆరోగ్యం అన్ని సమస్యలూ తీరిపోతాయి. పారిపోతాయి. ఈ అతుకుల బతుకుల నుంచి కొంతకాలం పాటు బయటపడిపోవాలి అనుకున్నాడు కొండయ్య.

"బాబాయ్! ఈ అవకాశం నాకు వదిలేయండి. గొప్ప కులంలో పుట్టిన పాపానికి పెద్ద చదువులు చదివినా చిన్న ఉద్యోగం కూడా రాలేదు. రాదు. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి పదివేలు డిపాజిట్ చేస్తే ఇస్తామంటున్నారు. అది కట్టే స్థోమత లేకనే రిక్షా లాగుతున్నాను. అందుకని నా రక్తం అమ్మేసి ఆ ఉద్యోగమైనా సంపాదించుకుంటా!" కొండయ్యను ప్రాధేయ పూర్వకంగా అడిగాడు నవీన్.

నవీన్ మాటలు విన్న కొండయ్యకు తను ఊహించుకున్నవన్నీ పేక మేడల్లా కుప్పకూలిపోయాయి. ఈ ఆశా నిరాశే అయ్యింది. నోరు మెదప లేక రిక్షాలోనే కూలబడ్డాడు.

"సార్! నాదీ ఎ పాజిటివ్ గ్రూపే నాకు మీరు ఇద్దామనుకున్న డబ్బులో సగం ఇప్పించండి చాలు" అంటూ అడిగాడు ఇంకొక రిక్షావాలా.

వారిలో వారికి పోటీ పెరిగింది. రక్తం ధర పడిపోతూ వుంది. ఎవరిని తీసుకెళ్ళాలో ఆ కారులో దిగిన వ్యక్తికి అర్థంకావడంలేదు. ఈ బ్లడ్‌కి రెండు రోజులుగా చాలా డిమాండ్‌గా వుందని విన్న అతనికి ఇక్కడ పరిస్థితి చూసాక ఆశ్చర్యపోయాడు. మనసులో ఆనందపడ్డాడు.

"సరే మీలో ఎవరో ఒకరు నిర్ధారించుకుని పది నిమిషాల్లో హాస్పిటల్‌లోకి రండి" అని కారెక్కి పక్కనే వున్న కార్పొరేట్ హాస్పిటల్‌కి వెళ్ళిపోయాడా వ్యక్తి.

రిక్షా వారంతా నేనిస్తాను. నేను వెళతాను. నాకు అవసరం. నాకు చాలా అవసరం అంటూ వాదించుకుంటున్నారు. పోటీ వస్తున్నందుకు తిట్టుకుంటున్నారు.

అందరివీ అతుకుల బతుకులే అవకాశం మాత్రం ఒక్కటే.

కొండయ్య రిక్షాలో కూర్చునే మౌనంగా చూస్తున్నాడు. మిగిలినవారు మాత్రం అవకాశం కోసం పోటీ పడుతున్నారు. రక్తం అమ్ముకోవడానికి ఎవరు వెళ్ళాలో తేలలేదు. రగడ పెద్దదైంది. నిర్ణయం జరగలేదు.

రిక్షాలు వరుసగా పెట్టి వచ్చిన బేరాల్ని న్యాయంగా ఒకరి తర్వాత ఒకరు పంచుకునే వీరిలో రక్తం అమ్ముకోవడానికి మాత్రం ఐకమత్యం లేకపోయింది.

కారణం మంచి అవకాశం. దరిద్రాన్ని పారదోలే అవకాశం. భవిష్యత్‌లో జనాభా ఇంకా పెరిగి రక్తానికి ఇంత ధర రాని అవకాశం. రక్తదాన శిబిరాలు ఎక్కువై ఉచితంగానే రక్తం ఇవ్వడానికి జనం ముందుకు వస్తున్న ఈ రోజులలో ఇలాంటి అవకాశం రావడం అరుదు.

అందుకే వారిలో ఓపిక నశించి పోతోంది. వారిలో వారు తిట్టుకోవడం, కొట్టుకోవడం మొదలు పెట్టారు. రగడ మరింత పెద్దదైంది. అందరి శరీరాలు గాయాలమయమవుతున్నాయి. గాయాల నుంచి రక్తం కారుతోంది. కానీ అవకాశం వదులుకోవడానికి మాత్రం ఎవరూ ఇష్టపడటం లేదు. కొండయ్య మొద్దుబారిన కొయ్యలా రిక్షాలో కూర్చునే చూస్తున్నాడు. వారి గొడవని ఆపలేని అశక్తత. ఏవేవో ఆలోచనలు.

అంతలో రిక్షావాళ్ళు తగాదా పడుతున్న చోటికి వచ్చి ఆగింది. వారంతా కొట్టుకోవడం ఆపి కారువైపు చూసారు.

కారులోని వ్యక్తి "నాకు కావలసిన బ్లడ్ డొనేట్ చేసే వ్యక్తి దొరికాడు ఇక మీ రక్తం అవసరం లేదు సారీ!" సింపుల్‌గా అనేసి కారు స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

అందరి ముఖాలు తెల్లబోయాయి. వారి శరీరాలలో నుంచి రక్తం ఇంకా కారుతూనే వుంది. తమలో తాము పోటీపడి కొట్టుకున్నందుకు బాధపడుతున్నారు. క్షమాపణలు చెప్పుకుంటున్నారు. కొండయ్య అన్నీ గమనిస్తూనే వున్నాడు.

"బాబాయ్! నన్ను మన్నించండి నా స్వార్థంకోసం మీకు పోటీ వచ్చాను. కానీ ఫలితం శూన్యం" అని కొండయ్యకు క్షమాపణలు చెప్పాడు నవీన్.

నవీన్ క్షమాపణలతో ఆలోచనల నుండి బయటపడిన కొండయ్యకు తక్షణ కర్తవ్యం గుర్తుకొచ్చింది.

లేచి ముసలి దంపతులున్న వార్డులోకి వెళ్ళాడు.

డబ్బున్న మారాజులు ఎక్కడైనా, ఏ వస్తువైనా కొనగలరు. కానీ మాలాంటి పేదోళ్ళ పరిస్థితి ఏమిటి? రేపు నా కుటుంబంలో ఏదైనా జరగరానిది జరిగినా నేనూ ఈ ముసలి దంపతుల్లా బిడ్డలపై ఆశ వదులుకోవాల్సిందే కదా? అందుకే అలా జరగకూడదు. వారి బిడ్డకు కావాల్సిన రక్తం నేనిస్తాను.

ఈ రోజు నుండి రక్తం అమ్ముకోవడానికి కాదు పేదోడి ప్రాణాలు నిలబెట్టడానికే దానం చేస్తాను. రక్తదానం చేస్తాను. ఎన్ని అవసరాలున్నా రక్తం అమ్ముకునే సంస్కృతి మాత్రం మా రిక్షా కార్మికులలో లేకుండా చేసి ఈ నెత్తుటి మరకను తుడిచేస్తాను. అనుకుని ముసలి దంపతుల కొడుకు పక్కనున్న ఖాళీ బెడ్‌పై పడుకున్నాడు రక్తం ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. ★